TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 108 | ఆదివారం, ఆగస్టు 18, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

## కర్నాటకలో రాజకీయ సంక్షోభం



బెంగళూరు: కర్ణాటక రాజకీయాల్లో మైసూరు ముడా కుంభకోణం కలకలం రేపుతోంది. ఈ కేసులో సిఎం సిద్ధరామయ్య విచారణను ఎదుర్కోనున్నారు. ఇందుకు రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ పర్మిషన్ ఇచ్చారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూముల కేటాయింపు వ్యవహారం కర్నాటక సిఎం సిద్ధరామయ్య మెడకు చుట్టుకుంటోంది. ఈ వ్యవహారంలో ఆయనను విచారించేందుకు కర్నాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అనుమతి మంజూరు చేశారు. అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17, భారత నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 218కింద సిఎం సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతి మంజూరు చేశారు. తాజా పరిణామాలపై కాంగ్రెస్ భగ్గుమంది. కర్నాటక కాంగ్రెస్ సర్కారును కూల్చేందుకు బిజేపి ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ వ్యవహారంపై చర్చించేందుకు ఈ సాయంత్రం కర్నాటక కేబినెట్ అత్యవసర సమావేశమవుతోంది. ఈ వ్యవహారంలో ఏం చేయాలనేదానిపై సిద్ధరామయ్యతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి. వేణుగోపాల్ మాట్లాడినట్టు తెలుస్తోంది. మరో వైపు గవర్నర్ అనుమతి మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ కర్నాటక హైకోర్టును ఆశ్రయించే ఆలోచనలో సిఎం సిద్ధరామయ్య ఉన్నారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూముల కుంభకోణం వ్యవహారంలో ముగ్గురు వ్యక్తులు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులను పరిశీలించిన తర్వాత వాటి విషయమై సంతృప్తి చెందిన గవర్నర్ – సిఎంపై విచారణకు అనుమతి మంజూరు చేసినట్టు రాజ్‌భవన్ లేఖ విడుదల చేసింది. ముడాకు సంబంధించి 14 ఇళ్ల స్థలాలను సిద్ధరామయ్య భార్యకు కేటాయించారన్నది ఆయనపై ఉన్న ప్రధాన ఆరోపణ.

## పాక్షిక రుణమాఫీయే...
## పూర్తిగా ఎక్కడ చేశారు?

### : హరీశ్ రావు



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తన చరిత్ర తెలుసునని... అలాగే సిఎం రేవంత్ రెడ్డి చరిత్ర కూడా తెలుసునని సిద్దిపేట ఎంఎల్ఏ హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతు రుణమాఫీ పాక్షికంగా చేశామని ప్రభుత్వం చెబితే అంగీకరిస్తామని, కానీ పూర్తిగా చేశామంటే ఒప్పుకునేది లేదన్నారు. రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరమని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తర్వాత రూ.17 వేల కోట్ల మేరకే చేసిందన్నారు. రైతులకు రూ.14 వేల కోట్లు కోత పెట్టారని విమర్శించారు. రుణమాఫీ పూర్తిగా చేయకుండానే తనను రాజీనామా చేయమని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. క్షమాపణ చెప్పాల్సింది, రాజీనామా చేయాల్సింది తాను కాదని... పాక్షిక రుణమాఫీ చేసినందుకు సిఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. 'రుణమాఫీ విషయంలో నేరుగా రైతుల వద్దకే వెళ్లి అడుగుదామా?' అని ప్రశ్నించారు. పాక్షిక రుణమాఫీ చేసి తనను రాజీనామా చేయమని అడగడం ఏమిటన్నారు. 'అసలు కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తానని మాట తప్పిందెవరు?' అని ప్రశ్నించారు. రుణమాఫీ సహా ఆరు గ్యారెంటీలు సంపూర్ణంగా అమలు చేస్తే రాజీనామా చేస్తానని చెప్పానని... కానీ ఏదీ పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు.

## ఎంఎల్ఏ హరీశ్ రావు సిద్దిపేట్...
## కార్యాలయం ధ్వంసం



సిద్దిపేట : ప్రస్తుత బిఆర్ఎస్ ఎంఎల్ఏ, మాజీ మంత్రి హరీశ్ రావు సిద్దిపేట కార్యాలయాన్ని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అది కూడా శనివారం తెల్లవారు జామున. ఈ దాడి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పనే అని బిఆర్ఎస్ నిందిస్తోంది. పంట రుణాల మాఫీ చేసినందున హరీశ్ రావు రాజీనామా చేయాలంటూ కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు ఫ్లెక్సీ బ్యానర్లను కూడా టౌన్ లో ఏర్పాటు చేశారని వార్త. ఇదివరలో పంట రుణమాఫీ చేస్తే తాను పదవికి రాజీనామా చేస్తానని హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాలు విసిరారన్నది ఇక్కడ గుర్తు చేసుకోవాలి. హరీశ్ రావు మద్దతుదారులు శుక్రవారం రాత్రి ఫ్లెక్సీ బ్యానర్లను తొలగించారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ వర్గం వారు నినాదాలు చేస్తూ ఒకరిపై మరొకరు విరుచుకుపడడంతో పోలీసులు కలుగజేసుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం తెల్లవారు జామున కొందరు గుర్తు తెలియని వ్యక్తులు హరీశ్ రావు కార్యాలయంలోకి చొరబడి బ్యానర్లను చించేసి, విధ్వంసం సృష్టించారు. పైగా 'జై కాంగ్రెస్' అంటూ నినాదాలు చేశారని సమాచారం. ఈ ఘటనను హరీశ్ రావు ఖండించారు. 'పోలీసులు దాడిని నివారించడానికి బదులు, విశృంఖలానికి పాల్పడిన వారికి రక్షణ నిచ్చారు' అని హరీశ్ రావు 'ఎక్స్' పోస్ట్ లో విమర్శించారు. డిజిపి ఈ ఘటనలో చర్యలు తీసుకోవాలని కూడా హరీశ్ రావు కోరారు. కాగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు ఇది పిరికిపంద చర్య అంటూ ఆ ఘటనను ఖండించారు. 'ఇదేనా రాహుల్ గాంధీ మొహబ్బత్ కీ దుకాణ్' అని విమర్శించారు. సిద్ధిపేట ఎమ్మెల్యే అధికారిక నివాసంపై అర్ధరాత్రి కాంగ్రెస్ గుండాలు దాడి చేసి తాళాలు పగలగొట్టి, ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం దారుణమైన విషయమని బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్ రావు మండిపడ్డారు. ఈ దాడి పట్ల తన ట్విట్టర్ లో హరీష్ రావు రెండు వీడియోలను పోస్టు చేశారు.

## మంత్రి జూపల్లి కారుపై రాళ్లతో దాడి చేసిన
## కాంగ్రెస్ కార్యకర్తలు



**జోగులాంబ గాద్వాల్: మంత్రి జూపల్లి కృష్ణారావు కారుపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేశారు. జూపల్లి డౌన్ డౌన్ అంటూ నిరసన తెలిపారు. గద్వాల జిల్లాలో రిజర్వాయర్ల పరిశీలనకు వెళ్తున్న జూపల్లి కృష్ణారావు కారును సరిత వర్గీయులు అడ్డుకొని రాళ్లతో దాడికి దిగారు. బిఆర్ఎస్ ఎంఎల్ఏ బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నందుకు నిరసనగా దాడి చేశారు. సరిత తిరుపతయ్య ఇంటికి మంత్రి జూపల్లి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆందోళన చేయడంతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మధ్యలోనే కారు దిగి తన ఇంటికి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.**

## స్కిల్ వర్సిటీలో ఆరు కోర్సులు...
## తరగతుల ఎప్పటి నుంచి అంటే...



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు రూపు దిద్దుకున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా పలు రంగాల్లో కోర్సులను దసరా పండగ నుంచి ప్రారంభిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా దాదాపు 20 కోర్సులను నిర్వహించాలని గుర్తించడం జరిగిందని, వీటిలో దసరా పండగ నుంచి ప్రాథమికంగా ఆరు కోర్సులను ప్రారంభించాలని నిర్ణయించినట్టు తెలిపారు.

ఈ స్కిల్ యూనివర్సిటీ ప్రారంభం, విధి విధానాల ఖరారు, కోర్సుల ప్రారంభం తదితర అంశాలపై నేడు ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఎస్. శాంతి కుమారి మాట్లాడుతూ.. ముచ్చర్ల వద్ద కేటాయించిన 57 ఎకరాల స్థలంలో ఈ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారని, ఈ నిర్మాణ పనులు ముగిసేంత వరకు ఈ యూనివర్సిటీని తాత్కాలిక భవనంలో నిర్వహించనున్నట్టు తెలిపారు.

## కోల్‌కతా ఘటనపై కొనసాగుతున్న...
## డాక్టర్ల నిరసనలు

హైదరాబాద్ : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అమానుష సంఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులు ఓపీ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు తెలంగాణ అంతటా ఓపీ సేవలను వైద్యులు బహిష్కరించారు. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ సేవలు నిలిచిపోయాయి. ఉస్మానియ, గాంధీ ఆస్పత్రిలో ఓపీలు నిలిచిపోవడంతో పలువురు రోగులు అవస్థలు పడ్డారు. అత్యవసర కేసులు తప్ప అన్ని సేవలు బంద్ చేశారు. ఆందోళనలో భాగంగా హైదరాబాద్‌లో వైద్యులు పలు చోట్ల ర్యాలీలు, ధర్నాలు చేపట్టారు. నిమ్స్ నుంచి ఇందిరా పార్కు వరకు డాక్టర్లు ర్యాలీ నిర్వహించారు. అలాగే ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్దకు వందలాది మంది డాక్టర్లు చేరుకుని ధర్నా చేశారు. డాక్టర్ల ఆందోళనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆదిలాబాద్ నిర్మల్, మంచిర్యాల, బెల్లంపల్లి ,ఆసిఫాబాద్ మెడికల్ కళాశాలలతో పాటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవులు నిలిపి వైద్యులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. ఆదిలాబాద్ రిమ్స్ మెడికల్ కళాశాల విద్యార్థులు వందలాదిమంది ప్లకార్డులు పట్టుకొని హత్యాచార ఘటనపై గొంతెత్తి నినదించారు. పట్టణంలోని నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు.





# తొమ్మిదేళ్లుగా కడుతున్న బ్రిడ్జ్.. మూడోసారి కూలిపోయింది

పాట్నా: బీహార్‌లో ఒక వంతెన నిర్మాణం తొమ్మిది సంవత్సరాలుగా సాగుతూ ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వం దీనిపై రూ. 1717 కోట్లు వెచ్చించింది. ఇప్పటికే రెండు సార్లు కూలిన ఈ వంతెన శనివారం మరొక మారు కూలిపోయింది. నిర్మాణంలో ఉండగానే ఇన్ని సార్లు కూలిన వంతెన నిర్మాణం పూర్తి అయిన తరువాత ఎన్ని రోజులు నిలుస్తుందని ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలని భాగల్పూర్ జిల్లాలో సుల్తాన్‌గంజ్%-%అగువాని గంగా నది రూట్‌ల ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణం చేపట్టింది. నాలుగు లేన్లతో నిర్మిస్తున్న ఈ వంతెన తొమ్మిది సంవత్సరాలు గడచినా పూర్తి కాకపోవడంతో ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటి వరకు కట్టిన వాటిలో రెండు పిల్లర్లు కూడా కూలిపోవడంపై నిపుణులు మండిపడుతున్నారు. కాగా, ఖగరియా జిల్లా కలెక్టర్ ఈ ఘటనపై మాట్లాడుతూ, వంతెన నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదనే విమర్శలపై పాట్నా హైకోర్టు స్పందించి, నిర్మాణ పనులపై స్టే ఇచ్చిందని తెలియజేశారు. ఇప్పటికే పూర్తయిన భాగాన్ని కూడా కూల్చివేయాలని కాంట్రాక్టర్‌ను హైకోర్టు ఆదేశించిందని ఆయన తెలిపారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా వంతెన కూల్చివేత పనులు చేపట్టారని ఆయన చెప్పారు. ఖగరియా, భాగల్పూర్ జిల్లాలను కలుపుతూ గంగా నదిపై నిర్మిస్తున్న ఈ వంతెన కాంట్రాక్ట్‌ను ఎస్‌పి సింగ్లా సంస్థ దక్కించుకుంది. 2014లో నిర్మాణ పనులు చేపట్టింది. నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వం విధించిన గడువును ఎనిమిది సార్లు పొడిగించింది. 2022లో వచ్చిన తుపాను కారణంగా నిర్మాణం దెబ్బ తిన్నది. ఆ తరువాత కూడా వంతెన కూలిపోవడంతో నాణ్యతపై సందేహాలు వ్యక్తమయ్యాయి.

### కోల్‌కతా ఘటనపై కొనసాగుతున్న...

# డాక్టర్ల నిరసనలు




హైదరాబాద్ : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అమానుష సంఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులు ఓపీ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు తెలంగాణ అంతటా ఓపీ సేవలను వైద్యులు బహిష్కరించారు. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ సేవలు నిలిచిపోయాయి. ఉస్మానియ, గాంధీ ఆస్పత్రిలో ఓపీలు నిలిచిపోవడంతో పలువురు రోగులు అవస్థలు పడ్డారు. అత్యవసర కేసులు తప్ప అన్ని సేవలు బంద్ చేశారు.

**ర్యాలీ.. ధర్నా..**

ఆందోళనలో భాగంగా హైదరాబాద్‌లో వైద్యులు పలు చోట్ల ర్యాలీలు, ధర్నాలు చేపట్టారు. నిమ్స్ నుంచి ఇందిరా పార్కు వరకు డాక్టర్లు ర్యాలీ నిర్వహించారు. అలాగే ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్దకు వందలాది మంది డాక్టర్లు చేరుకుని ధర్నా చేశారు. డాక్టర్ల ఆందోళనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటా పోలీసులు అప్రమత్తమయ్యారు.

**ఆదిలాబాద్‌లో...**

ఆదిలాబాద్ నిర్మల్, మంచిర్యాల, బెల్లంపల్లి ,ఆసిఫాబాద్ మెడికల్ కళాశాలలతో పాటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిపి వైద్యులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. ఆదిలాబాద్ రిమ్స్ మెడికల్ కళాశాల విద్యార్థులు వందలాదిమంది ప్లకార్డులు పట్టుకొని హత్యాచార ఘటనపై గొంతెత్తి నినదించారు. పట్టణంలోని నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదుట మెడికల్ అందరూ మానవహారం గా ఏర్పడి వాహనాల రాకపోకలను స్తంభింపజేశారు. ఆదిలాబాద్ రిమ్స్ మెడికల్ కళాశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఓపి సేవలతోపాటు అన్ని రకాల సర్జరీలను నిలిపివేశారు. దీంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రోగులు పలు ఇబ్బందులు పడ్డారు.

**రాఖీ కట్టి... వినతి పత్రం అందజేత...**

ఈ సందర్భంగా మెడికో విద్యార్థినులు జిల్లా కలెక్టర్ రాజార్శి షా కు వినతి పత్రం సమర్పించి కలెక్టర్‌కు రాఖీ కట్టారు. కాగా హత్యాచార ఘటనకు నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు రిమ్స్ కళాశాల ఎదుట నిరసన ధర్నా చేపట్టారు.

### మంత్రి జూపల్లి కారుపై రాళ్లతో దాడి చేసిన

# కాంగ్రెస్ కార్యకర్తలు

జోగులాంబ గాద్వాల్: మంత్రి జూపల్లి కృష్ణారావు కారుపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేశారు. జూపల్లి డౌన్ డౌన్ అంటూ నిరసన తెలిపారు. గద్వాల జిల్లాలో రిజర్వాయర్ల పరిశీలనకు వెళ్తన్న జూపల్లి కృష్ణారావు కారును సరిత వర్గీయులు అడ్డుకొని రాళ్లతో దాడికి దిగారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎ బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నందుకు నిరసనగా దాడి చేశారు. సరిత తిరుపతయ్య ఇంటికి మంత్రి జూపల్లి వెళ్లారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆందోళన చేయడంతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మధ్యలోనే కారు దిగి తన ఇంటికి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# రేవంత్ రెడ్డి తదుపరి రాజకీయ గమ్యం బీజేపీయే

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బృందంతో కలిసి త్వరలో భారతీయ జనతా పార్టీ (బిజెపి)లో చేరనున్నట్లు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు ఒక ఆశ్చర్యకరమైన వెల్లడిలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదుపరి రాజకీయ గమ్యం బీజేపీయేనని రామారావు శనివారం ఇక్కడ అన్నారు. మీడియా వ్యక్తులతో అనధికారిక చిట్ చాట్‌లో, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఇటీవల తన సహచరులలో ఒకరితో ఈ షాకింగ్ ప్లాన్‌లను స్వయంగా వెల్లడించారని చెప్పారు.



తాను బీజేపీలో పుట్టానని, బీజేపీలోనే తన రాజకీయ ప్రయాణాన్ని ముగించుకుంటానని ముఖ్యమంత్రి తన సన్నిహితులకు గుర్తు చేశారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు హామీ ఇచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తెలిపారు.

తాను ఏబీవీపీతో రాజకీయ యాత్ర ప్రారంభించానని, కాషాయ జెండాతోనే ముగిస్తానని రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి తెలిపారని, ఈ ఆరోపణలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని రామారావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పంట రుణాల మాఫీ క్లెయిమ్‌లకు సంబంధించి, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ 47 లక్షల మందికి పంట రుణాలు మాఫీ చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నొక్కి చెప్పారు. పంట రుణాల మాఫీకి దాదాపు రూ.40 వేల కోట్లు అవసరమవుతాయని ముఖ్యమంత్రి చెప్పారు. అయితే కేబినెట్ ఆమోదించింది కేవలం రూ. 31,000 కోట్లు మరియు కేటాయించిన బడ్జెట్ రూ. 27,000 కోట్లు. చివరకు రూ.లక్షతో పంట రుణమాఫీ చేశామని ప్రకటించారు. 17,000 కోట్లు, 22 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తెలిపారు. బీఆర్ఎస్ గ్రామస్థాయిలో రుణమాఫీపై సమగ్ర సమాచారాన్ని సేకరించి, జిల్లా కలెక్టర్లకు, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని, రెండు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

బీఆర్ఎస్ ముఖ్యమంత్రి మరియు ఇతర క్యాబినెట్ మంత్రుల నియోజకవర్గాల నుండి పంట రుణాల మాఫీ వివరాలను సేకరిస్తుంది. రైతులందరి పంట రుణాలను మాఫీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. బీఆర్ఎస్ కాల్ సెంటర్‌కు రైతుల నుంచి దాదాపు 1.20 లక్షల పంట రుణాల మాఫీ ఫిర్యాదులు అందాయి. గ్రామాల్లోని ప్రతి ఇంటిని సందర్శించడం ద్వారా ప్రో ఫార్మాలో మొత్తం సమాచారాన్ని సేకరించేందుకు పార్టీ పని చేస్తోంది మరియు ఈ పనిని ప్రతి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే లేదా మాజీ ఎమ్మెల్యే లేదా సీనియర్ నాయకుడు నిర్వహిస్తారు. రైతుల పంట రుణాలు 40 శాతం కూడా మాఫీ కాలేదు. ఈ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ దృష్టి మళ్లించే వ్యూహాలు పన్నుతున్నాయని రామారావు ఆరోపించారు.

కర్నాటకలో ఫాక్స్‌కాన్ పెట్టుబడులపై, %దీ=ా% వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు నాయకత్వంలో, లక్ష ఉద్యోగాల సృష్టికి ఫాక్స్‌కాన్ కంపెనీతో ఒక అవగాహన సంతకం చేయబడింది. "రేవంత్ రెడ్డి భాష మరియు పరిపాలనా వైఫల్యం కారణంగా కంపెనీ వెనక్కి తగ్గిందా" అని కెటి రామారావు అడిగారు మరియు తెలంగాణలో ఫాక్స్‌కాన్ పెట్టుబడులు మరియు దాని విస్తరణ ప్రణాళికల గురించి వాస్తవాలను పంచుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆగస్టు 24న మహిళా కమిషన్ ఎదుట హాజరై, గత ఎనిమిది నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన దారుణాలను బయటపెడతానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తెలిపారు.

### జమ్మూ కశ్మీర్, హర్యానా ఎన్నికలకు...

# మోగిన నగారా




న్యూఢిల్లీ : జమ్మూ కశ్మీర్ శాసనసభ ఎన్నికలు మూడు దశలుగా సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ (ఇసి) శుక్రవారం ప్రకటించింది. 90 మంది సభ్యుల హర్యానా శాసనసభ ఎన్నికలను అక్టోబర్ 1న నిర్వహించనున్నట్లు ఇసి తెలియజేసింది. ఆ రెండు ఎన్నికల వోట్ల లెక్కింపు అక్టోబర్ 4న జరుగుతుందని కమిషన్ తెలిపింది. ఎన్నికల సన్నాహకాల పర్యవేక్షణకు ఇసి అధికారులు ఆ రెండు రాష్ట్రాలను ఇటీవల సందర్శించిన అనంతరం ఈ ప్రకటన చోటు చేసుకున్నది. ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు సమక్షంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్ శుక్రవారం విలేకరుల గోష్ఠిలో ఈ ఎన్నికల ప్రకటన చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో మొదటి దశలో 24 సీట్లకు, రెండవ దశలో 26 సీట్లకు, చివరి దశలో 40 సీట్లకు పోలింగ్ జరుగుతుంది. 2019లో హర్యానాతో పాటే ఎన్నికలు జరిగిన మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలకు తేదీలను తరువాత ప్రకటిస్తామని రాజీవ్ కుమార్ చెప్పారు. జమ్మూ కాశ్మీర్‌లో భద్రత అవసరాల కారణంగా మహారాష్ట్రకు ఇప్పుడు ఎన్నికలు ప్రకటించలేదని ఆయన వివరించారు. ఈ ఏడాది జార్ఖండ్, ఢిల్లీ అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరగవలసి ఉన్నది.

జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్రం రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన తరువాత, రాజ్యాంగంలోని 370 అధికరణం కింద ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసిన దరిమిలా ఐదు సంవత్సరాలకు పైగా గడచిన తరువాత ఒక కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రెండవ కేంద్రపాలిత ప్రాంతం లడఖ్. జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీలో సభ్యుల సంఖ్య 90. హర్యానా అసెంబ్లీ గడువు ఈ ఏడాది నవంబర్‌లో ముగుస్తుంది. జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సుప్రీం కోర్టు సెప్టెంబర్ 30ని గడువుగా నిర్దేశించింది. జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడాన్ని వ్యతిరేకించిన ప్రతిపక్షాలు అక్కడ ఎన్నికలు నిర్వహించాలని కోరసాగాయి. 370 అధికరణం అమలులో ఉన్నప్పుడు జమ్మూ కాశ్మీర్‌కు సొంత రాజ్యాంగం, రక్షణ, కమ్యూనికేషన్లు, విదేశీ వ్యవహారాల్లో మినహా అన్ని విషయాల్లో విధాన నిర్ణాయక అధికారాలు ఉన్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో చివరిసారిగా 2014 నవంబర్, డిసెంబర్‌లో ఐదు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. బిజెపి, పిడిపి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. పిడిపి వ్యవస్థాపక నేత ముఫ్తీ మొహమ్మద్ సయీద్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

2016 జనవరిలో సయీద్ మరణానంతరం స్వల్ప కాలం గవర్నర్ పాలన తరువాత మెహబూబా ముఫ్తీ ముఖ్యమంత్రి అయ్యారు. 2018 జూన్‌లో పిడిపి సారథ్యంలోని ప్రభుత్వానికి బిజెపి మద్దతు ఉపసంహరించగా అప్పటి గవర్నర్ సత్యపాల్ మాలిక్ ఆ ఏడాది నవంబర్‌లో అసెంబ్లీని రద్దు చేశారు. రాష్ట్రానికి అప్పటి నుంచి అసెంబ్లీ లేదు. జమ్మూ కాశ్మీర్‌లో శ్రీనగర్, గండెర్‌బల్, పూంఛ్, రాజౌరి, రియాసి సహా ప్రధాన ప్రాంతాలు రెండవ దశలో వోట్లు వేస్తాయి. తుది దశలో ఉత్తర కాశ్మీర్‌లోని ఉద్ధంపూర్, జమ్మూ, కథువాలో ప్రజలు తమ వోట్లు వేస్తారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అధ్వాన ప్రదర్శన చేసిన మెహబూబా ముఫ్తీ నేతృత్వంలోని పిడిపి అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావాలని లక్షంతో ఉన్నది. మొత్తం 90 సీట్లకు పోటీ చేయాలని అనుకుంటున్న కాంగ్రెస్ పార్టీ జమ్మూపై దృష్టి కేంద్రీకరించవచ్చు. కాశ్మీర్‌తో పోలిస్తే జమ్మూలోనే పార్టీకి ఎక్కువ మద్దతు, సంస్థాగత వ్యవస్థ ఉన్నాయి. మరొక వైపు బిజెపి కూడా తన ఎన్నికల సన్నాహకాలు ముమ్మరం చేసింది. ఇక హర్యానాలో ప్రస్తుత బిజెపి ప్రభుత్వం కాలపరిమితి నవంబర్‌లో ముగియనున్నది.

# మను బాకర్ ఆటవిడుపు



న్యూఢిల్లీ: భారత షూటింగ్ సంచలనం, ఒలింపిక్ డబుల్ మెడల్ విన్నర్ మను బాకర్ కొన్ని రోజుల పాటు ఆటకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. పారిస్ ఒలింపిక్స్ కోసం ఎడతెరిపి లేకుండా శ్రమించిన బాకర్ కొంత కాలం పాటు విరామం తీసుకోవాలని భావిస్తోంది. కోచ్ జస్పాల్ రానాతో కలిసి పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో బాకర్ పలు విషయాలను వెల్లడించింది. ఒలింపిక్ పతకం సాధించాలనే లక్షంతో పిస్టల్ చప్పుళ్లతో తీరిక లేకుండా గడిపానని, దీంతో కొన్ని నెలలు షూటింగ్‌కు కాస్త దూరంగా ఉండాలని భావిస్తున్నట్టు వెల్లడించింది. మూడు నెలల పాటు విరామం తీసుకుని, గుర్రపు స్వారీ, స్కేటింగ్, భరతనాట్యం తదితర అంశాలపై దృష్టి పెడుతున్నట్టు వెల్లడించింది. మను బాకర్ పిటిఐ భేటీలో పలు ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఎప్పుడూ షూటింగ్‌తో తీరిక లేకుండా ఉండే తనకు ఇప్పుడు కొంత సమయం లభించింది. చిన్నతనంలో కరాటేలో శిక్షణ పొందానని, అయితే షూటింగ్ వల్ల దీనికి తగినంత సమయం కేటాయించలేక పోయానని పేర్కొంది. ఇప్పుడు నా వ్యక్తిగత ఇష్టాల కోసం సమయం వెచ్చించాలని భావిస్తున్నా. నాకు చాలా అభిరుచులున్నాయి. వాటిని నెరవేర్చుకుని సమయం ఆసన్నమైంది. గుర్రపు స్వారీ, స్కేటింగ్ అంటే తనకుఎంతో ఇష్టం. డ్యాన్స్ కూడా చాలా ఇష్టమే. భరతనాట్యం నేర్చుకుంటున్నా. ఒలింపిక్స్ నేపథ్యలో భరతనాట్యం క్లాసులకు హాజరుకావడం కుదరలేదు. ఇప్పుడు దీని కోసం సమయం కేటాయిస్తా. వయోలిన్‌లో కూడా తనకు ప్రావీణ్యం ఉన్నట్టు మను బాకర్ వెల్లడించింది. గుర్రాపు స్వారీ అంటే తనకు చాలా ఇష్టమని దాని కోసం ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నట్టు వివరించింది. దీంతో పాటు స్కైడైవింగ్, స్కూబా డైవింగ్ కూడా చేయలాని భావిస్తున్నట్టు తెలిపింది. ఈ జాబితాను విన్న కోచ్ రానా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. గుర్రపు స్వారీకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇచ్చే ప్రసక్తేలేదని రానా స్పష్టం చేశాడు. స్కేటింగ్, గుర్రపు స్వారీ వంటి క్రీడలు చాలా ప్రమాదం కూడుకున్నవని ఈ క్రమంలో గాయాలకు గురయ్యే ప్రమాదం ఉందని రానా అభిప్రాయపడ్డాడు. అయితే మను బాకర్ మాత్రం తాను ఇప్పటికే ఈ క్రీడల్లో శిక్షణ తీసుకున్నానని, ఏదైన గాయం జరిగితే తనదే పూర్తి బాధ్యత అని సరదాగా చెప్పింది. ఇక పారిస్ ఒలింపిక్స్ తన కెరీర్‌లోనే చాలా కీలకమని వివరించింది.

## సంపాదకీయం

ఆదివారం, ఆగస్టు 18, 2024

# లోక్‌సభలో దక్షిణాది సీట్లకు గండి..?

దేశంలో చివరిసారిగా 1971వ సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం 1977వ సంవత్సరం నాటికి 543 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 1976వ సంవత్సరంలో నాటి ప్రధాని ఇందిరా గాంధీ 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా 2021 జనగణన వరకు లోక్‌సభ స్థానాలను పెంచకుండా చట్టంచేశారు. అందుకు ప్రధాన కారణం దేశంలో జనాభా నియంత్రణను అమలు చేస్తున్న రాష్ట్రాలు నష్టపోకూడదని, జనాభా నియంత్రణను అన్ని రాష్ట్రాలు పాటించాలన్న ఉద్దేశంతో అనాడు ఇందిరా గాంధీ సర్కార్ చట్టం చేశారు. కానీ అప్పుడు ఏ కారణం చేతైతే జనాభా నియంత్రణను పాటిస్తున్న రాష్ట్రాలు నష్టపోవొద్దన్న భావనతో చట్టం తీసుకురాగా, ఇప్పుడు అదే చట్టం జనాభా నియంత్రణను పకడ్బందీగా అమలు చేసి విజయం సాధించిన రాష్ట్రాల పాలిట శాపం కానుందని జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ నియోజక వర్గాల పునర్విభజన చేసే విధానాన్ని చూస్తే అర్థమవుతుంది. 2002 సం.లో ఆటల్ బిహారీ వాజపేయి నేతృత్వంలోని ఎన్‌డిఎ 84వ రాజ్యాంగ సవరణ చేసి 2026 తరువాత జరిగే తొలి జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ స్థానాల సంఖ్య పెంచాలని నిర్దేశించింది. పునర్విభజన ద్వారా అనుసరించే విధానాల వల్ల కేంద్రం సూచనల మేరకు కుటుంబ నియంత్రణ ద్వారా జనాభా పెరుగుదలకు అడ్డుకట్ట వేసిన దక్షిణాది రాష్ట్రాలకు తీరని నష్టం వాటిల్లనుంది. జనాభా తక్కువగా ఉండడం మూలాన లోక్‌సభలో ఆయా రాష్ట్రాల ప్రాతినిధ్యానికి భారీగా కోతపడనుంది.దేశంలో ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలు తెలంగాణ, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల జనాభా తక్కువ. లోక్‌సభ నియోజక వర్గాల పునర్విభజనకు అనుసరించే ఈ జనాభా లెక్కల ప్రామాణికంతో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభలో ఉన్న 543 మొత్తం స్థానాల్లో 23.74 శాతం అంటే 129 స్థానాల ప్రాతినిధ్యం ఉండగా, కేంద్రం అనుసరించే పునర్విభజన వల్ల ఆ రాష్ట్రాల ప్రాతినిధ్యం 6.26 శాతం తగ్గిపోయి 129 స్థానాల నుండి 103 స్థానాలకు పడిపోనుంది. కానీ ఇబ్బడిముబ్బడిగా జనాభాను పెరుగుదలలో పెద్దన్న పాత్ర పోషించిన ఉత్తరాది రాష్ట్రాలకే వరంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విధానాలు ఉండడం గమనార్హం. అంటే 2026లో పునర్విభజన విధానాల ద్వారా జనాభా నియంత్రణలో దక్షిణ రాష్ట్రాల సాఫల్యత వాటి రాజకీయ ప్రాతినిధ్యానికే ఎసరు పెడుతుంది. లోక్‌సభలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని ఒకేసారి పరిశీలిస్తే.. ప్రస్తుత సీట్లు 543 లో ఉత్తరాది రాష్ట్రాలైన యుపి 80 సీట్లు, మహారాష్ట్ర 48, పశ్చిమ బెంగాల్ 42, బీహార్ 40, మధ్యప్రదేశ్ 29 సీట్లను కలిగి ఉండగా, దక్షిణాది రాష్ట్రాలు ఎపి, తెలంగాణ 42 సీట్లు, కర్ణాటక 28 సీట్లు, కేరళ 20 సీట్లు, తమిళనాడు 39 సీట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. పునర్విభజన కోసం రెండు ప్రతిపాదనలను ఆలోచిస్తున్న కేంద్రం మొదటగా జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ స్థానాలను 848కి పెంచి దేశ జనాభాతో భాగించగా వచ్చేది దేశ పార్లమెంట్ స్థానం సగటు జనాభా, ఈ సగటు పార్లమెంటు జనాభా సంఖ్యతో రాష్ట్ర జనాభాను భాగిస్తే ఆ రాష్ట్రంలోని పార్లమెంటు స్థానాల సంఖ్య వస్తుంది. ఈ విధంగా చూస్తే మన దక్షిణాది రాష్ట్రాల స్థానం పార్లమెంటులో స్థానాలు 130 నుండి 165కు కొద్ది మేర పెరిగిన నిష్పత్తి ప్రకారం చూస్తే దారుణంగా 23 శాతం నుండి 19 శాతానికి పడిపోనుంది.. ఇక రెండో ప్రతిపాదన ఏంటంటే.. లోక్‌సభ స్థానాలను ప్రస్తుతం ఉన్న 545కే పరిమితం చేసి చేపట్టబోయే జనాభా లెక్కల ప్రకారం పునర్విభజించటం. ఇలా చేసినా నష్టపోయేది దక్షిణాది రాష్ట్రాలే. ఈ విధానంలో దేశ జనాభాను 545తో భాగిస్తారు. అప్పుడు జనాభా అధికంగా పెరిగిన రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలు కూడా పెరుగుతాయి. జనాభా తక్కువ ఉన్న రాష్ట్రాల్లో తగ్గిపోతాయి. ఈ లెక్కన తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 లోక్‌సభ స్థానాలు 14కు పడిపోతాయి. అంటే మూడు స్థానాలు ఎగిరిపోతాయి. రెండింటిలో ఏ విధానంలో నియోజక వర్గాలను పునర్విభజించినా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ తమ ప్రాబల్యం అధికంగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలే.. అంటే పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల మాట ఏ మేరకు చెల్లుబాటు అవుతుందో అర్థం చేసుకోచ్చు. దక్షిణాది రాష్ట్రాల మాదిరిగా కుటుంబ నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో అధిక జనాభా కలిగిన ఉత్తరాది రాష్ట్రాలు లోక్‌సభ లో తమ సీట్ల సంఖ్యను ఇప్పటికన్నా ఎక్కువగా పెంచుకొనున్నాయి. ఈ లెక్కన చూస్తే పరిపాలన, అభివృద్ధి, జనాభా నియంత్రణ వంటి అంశాలపై దృష్టి సారించిన దక్షిణాది రాష్ట్రాలకు శిక్షగా లోక్‌సభ ప్రాతినిధ్యానికి, రాజకీయ ప్రాధాన్యానికీ కోతపడబోతుందన్నమాట. దాని వల్ల హక్కుగా రావాల్సిన నిధుల కోసం డిమాండ్ చేసే సత్తా, అనుకూలమైన విధానాల రూపకల్పన చేసేలా కేంద్రంపై ఒత్తిడి చేయగల శక్తి దక్షిణాది రాష్ట్రాలకు తగ్గుతుంది. పర్యవసానంగా ఉత్తర %-% దక్షిణ విభేదాలు, ప్రాంతీయ ఉద్రిక్తతలకు పెచ్చరిల్లే ప్రమాదం కూడా లేకపోలేదు.

# డా.మౌమిత అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

- అమ్మాయిలపై దాడులను అరికట్టాలి
- అమ్మాయిల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి
- రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కా పెల్లి పూజ




**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలకత్త నగరంలో ఆర్జిగర్ ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ కాలేజ్ లో పనిచేస్తున్న మహిళా జూనియర్ డాక్టర్ పై అమానుషంగా లైంగికదాడికి పాల్పడి.. హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో నర్సింగ్ విద్యార్థులతో విద్యార్థులతో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కాపల్లి పూజ మాట్లాడుతూ దేశంలో అమ్మాయిలకు రక్షణ కల్పించాలని అదేవిధంగా సంఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా కూడా మమత బెనర్జీ స్పందించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు .ఈరోజు జూనియర్ వైద్యురాలి పై జరిగిన మృతి సామూహిక అత్యాచారమని తెలిసిన కూడా దాన్ని దారి మళ్ళించే ప్రయత్నం చేస్తుందన్నారు.మహిళలకు రక్షణ కల్పించే చట్టాలు అభయ ,నిర్భయ ,ఫాక్సో చట్టాలు ఉన్నప్పటికీ కేవలం చుట్టాలు గానే పనిచేస్తున్నాయన్నారు. షీ టీమ్స్ షో టీమ్స్ గా మారుతున్నాయని అమ్మాయిల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు మౌమిత మృతి పైన సమగ్ర విచారణ జరిపించాలని నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాధితురాలు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ , ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి భరత్, సాత్విక, ఇమ్రా, శరణ్య, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

## పోడు భూముల పట్టా జారీ పై జిల్లా అధికారులతో

# వీడియో కాన్ఫరెన్స్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర అటవీ , పర్యావరణ దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) తో కలిసి పోడు భూముల పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోడు భూముల పట్టా కోసం 507 దరఖాస్తులను ప్రభుత్వానికి సమర్పిస్తే కేవలం 27 మందికే పట్టాలు వచ్చాయని,మిగిలిన అర్హులందిరికి పట్టాలు అందేలా చూడాలని ప్రభుత్వ విప్ కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి, కోనరావుపేట చెందుర్తి , గంభిరావు పేట, రుద్రంగి, కోనారావుపేట, ఎల్లారెడ్డి పేట, మండలాల్లోని గిరిజనులకు పోడు పట్టాలు రాలేదని, వీరి దరఖాస్తులను మరోసారి క్షేత్రస్థాయిలో రీ సర్వే నిర్వహించి పట్టాలు పంపిణీ చేయాలని అన్నారు. వేములవాడ నియోజకవర్గం పరిధిలో మోత్కరావుపేట ,చందుర్తి రోడ్డు పనులు అటవీ అనుమతుల కారణంగా అర్ధాంతరంగా ఆగిపోయాయని,




ఈ రోడ్డు నిర్మాణం జరిగితే ఖానాపూర్ నుంచి హైదరాబాదుకు వయ రాయికల్ వెళ్ళడానికి 35 కిలోమీటర్ల మేర ప్రయాణం బారం తగ్గుతుందని అన్నారు. రోడ్డు నిర్మాణానికి అటవీ ప్రాంతంలో 3.5 కిలోమీటర్ల వేసేందుకు అవసరమైన అనుమతులు త్వరగా అందేలా చూడాలని ప్రభుత్వ విప్ కోరారు.

# వైద్యురాలి మృతికి ఘన నివాళి

- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- కొవ్వొత్తులతో నివాళులు అర్పించిన గోపాలరావుపేట వాసులు

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** కర్ణాటకలో రాష్ట్రంలో





అత్యాచారానికి గురైన యువ వైద్యురాలు మౌమిత మృతికి నిరసనగా రామడుగు మండలం గోపాలరావు పేట గ్రామ బస్టాండ్ లో శనివారం గ్రామస్తులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి అనంతరం కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ దేశంలో ఆడపిల్లల మీద రోజుకొక సంఘటన జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అఘాయిత్యాలకు పాల్పడేవారికి భయం లేకుండా పోయిందని ఆడపిల్లల రక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. 78ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో నేటికీ స్త్రీలకు ఆడపిల్లలకు రక్షణ, స్వేచ్ఛ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. కోల్ కతా లో పిజీ విద్యార్థినిపై జరిగిన అత్యాచారం,హత్య సంఘటన దేశంలో సంచలనం సృష్టించి రెండు రోజులు అవుతున్నా నేటికీ నిందితులను పట్టుకోవడంశిక్షించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు.పాశవికంగా అత్యాచారానికి పాల్పడటమే కాకుండా దారుణంగా హతమార్చిన నిందితులను వెంటనే శిక్షించాలని మృతి చెందిన వైద్య విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీచు తిరుపతి రెడ్డి,ఆరె వినోద్,ఎడవెల్లి పాపిరెడ్డి,కొలిపాక కమలాకర్, పోచంపెల్లి నరేష్, తాళ్లపెల్లి విష్ణు, జనరల్ స్టోర్ యజమాని బుర్ర సాయిలు, ఎడవెల్లి మహిపాల్ రెడ్డి,సంతోష్ ,గ్రామ యువకులుతదితరులు పాల్గొన్నారు.

## చంద్రంపేట పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** సిరిసిల్ల అర్బన్ చంద్రంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రక్షా బంధన్ ఉత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రోజున విద్యార్థులు ఒకరికొకరు రక్షలు కట్టుకొని మిఠాయిలు పంచుకున్నారు. పిల్లలను ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు రక్షా బంధన్ ప్రాముఖ్యతను వివరించారు.నువ్వు నాకు రక్షా నేను నీకు రక్షా మనమంతా కలిసి మన దేశానికి ధర్మానికి రక్షగా వుండాలని, తద్వారా మనమంతా సుఖ సంతోషాలతో వుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం కొండికొప్పుల రవి, ముంజ రమ, వేముల అంజలి, గువలకొండ శ్రీనివాస్, ఒద్యారం మధుసూదన్,లత ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేట బంద్

# విజయవంతం



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ ఎల్లారెడ్డిపేట:** బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న అఘాయిత్యాలకు, దాడులకు నిరసనగా శనివారం రోజున నిర్వహించిన ఎల్లారెడ్డిపేట మండలం బంద్ విజయవంతం అయింది. మండల ప్రజలు, వాణిజ్య, వ్యాపార, విద్యాసంస్థలు అందరూ స్వచ్ఛందంగా బంద్ ని పాటించారు. బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బంద్ కు స్వచ్ఛందంగా మద్ధతు తెలిపిన బంద్ లో పాల్గొన్న ఎల్లారెడ్డిపేట మండల ప్రజలందరికీ, వ్యాపార వాణిజ్య విద్యాసంస్థలకు హిందూ ఉత్సవ సమితి ఎల్లారెడ్డిపేట మండల శాఖ ధన్యవాదాలు తెలిపారు.

## ఎంజెఆర్ ఫౌండేషన్ అధ్వర్యంలో

# ఇంటింటికి రాఖీ పంపిణీ



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం:** మండలం లోని ప్రతి గ్రామానికి రాఖీ పౌర్ణమి సందర్బంగా తమ ఎంజేఆర్ ఫౌండేషన్ అధ్వర్యంలో శనివారం ప్రతి ఇంటికి రాఖీలు మరియు పసుపు, కుంకుమ అందజేసారు . కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి మానకొండూర్ అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి మాట్లాడుతూ రక్షా బంధన్ అన్న, చెల్లెళ్ళు, అక్క ,తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగ రోజు మండలంలోని అక్క, చెల్లెళ్ళకి రాఖీలు అందజేయడం సంతోషంగా ఉందని, వారికి ఎప్పుడు ఒక అన్నగా అండగా ఉంటానని తెలియజేశారు, ఇంటింటికి రాఖీలు అందజేయటం పట్ల ఆయా గ్రామాల్లోని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పర్శరాములు గౌడ్, వెంకటేష్ గౌడ్, లక్ష్మయ్య, బామండ్ల రాజు, స్వామి రెడ్డి, సంపత్ మరియు మహిళలు పాల్గొన్నారు.

## నాకు నీవు రక్ష నీకు నేను రక్ష



**మద్దూర్ ఆగష్టు 15:**

నారాయణపేట జిల్లా మద్దూరు మండలం రెనివట్ల గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు తమ తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. నాకు నీవు రక్ష నీకు నేను రక్ష అని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్ మాట్లాడుతూ రక్షాబంధన్ ఔన్నత్యాన్ని అన్నాచెల్లెళ్ల అనుబంధం గురించి విద్యార్థులకు వివరించి తెలిపారు పాఠశాల విద్యార్థులు రోజు పాఠశాలకు విధిగా రావాలని రోజువారిగా చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్, ఉపాధ్యాయులు వీరయ్య, సతీష్, బ్రహ్మయ్య, సాయికుమార్,రాజశేఖర్, రాజేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వీసీలకు విజిలెన్స్ చెక్




**హైదరాబాద్ :**కాకతీయ వర్శిటీ వీసీలను విజిలెన్స్ వెంటాడుతోంది. 2013లో కాకతీయ యూనివర్సిటీలో కొంతమంది ఉద్యోగులను ప్రభుత్వ అనుమతి లేకుండానే రెగ్యులర్ చేశారన్న ఆరోపణల మేరకు ఫిర్యాదులు అందగా.. వరంగల్ విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు మాజీ వీసీ వెంకటరత్నంకు నోటీసులు ఇచ్చారు. వచ్చే నెల 16వ తేదీన ఉదయం 11 గంటలకు విచారణ నిమిత్తం తమ ఎదుట హాజరు కావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొన్నారు.అంతేగాకుండా ఆయనపై అందిన ఫిర్యాదుకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని, దాంతో పాటు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడానికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు, ఇతర డాక్యుమెంట్స్ తో విచారణకు హాజరు కావాల్సిందిగా.. నోటీసుల్లో ఆదేశించారు. కాగా వెంకటరత్నం వీసీగా పని చేసిన సమయంలో దాదాపు 37 మంది మినిమం టైమ్ స్కేల్ ఎంప్లాయిస్ ను ప్రభుత్వ అనుమతి లేకుండా, నిబంధలనకు విరుద్ధంగా రెగ్యులరైజ్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి.ఈ వ్యవహారంపై గతంలోనే వివాదం మొదలైంది. పలుమార్లు ఈసీ మీటింగ్ ల్లోనూ చర్చ జరిగింది. 2019 లో ఆ నియామకాలు చెల్లవంటూ ఈసీ తీర్మానం చేయగా.. వాళ్లంతా కోర్టుకు వెళ్లినట్లు తెలిసింది.కొద్దిరోజుల కిందట మాజీ వీసీ రమేష్ పై..ఈ ఏడాది మే 18న కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ పై విజిలెన్స్ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేషం విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డీజీకి ఆదేశాలు జారీ చేశారు.కేయూ వీసీగా నియామకం అయినప్పటి నుంచి ప్రొఫెసర్ తాటికొండ రమేష్ చేసిన అక్రమాలపై ఇప్పటికే అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్(అకుట్) పలుమార్లు ఫిర్యాదు చేయగా, స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఎంక్వైరీ చేపట్టేందుకు విజిలెన్స్ కు ఆర్డర్స్ ఇచ్చింది. వీసీగా పోస్టింగ్ కు ప్రొఫెసర్ గా పదేళ్ల అనుభవం అవసరం అయినప్పటికీ తనకున్న పరిచయాలతో వైస్ ఛాన్స్ లర్ గా ప్రొఫెసర్ రమేష్ అక్రమంగా పోస్టింగ్ తెచ్చుకున్నారనే ఆరోపణలు అప్పట్లోనే వెల్లువెత్తాయి.దీంతో కొంతమంది కోర్టుకు వెళ్లగా.. ఆ కేసు ఇంకా నడుస్తోంది. అంతేగాకుండా వీసీ రమేశ్ రూల్స్ కు విరుద్ధంగా సీనియర్ ప్రొఫెసర్ ప్రమోషన్ పొందారనే ఆరోపణలున్నాయి. అంతేగాకుండా ఎలాంటి అనుమతులు లేకుండానే 16 మందిని అనుబంధ అధ్యాపకులుగా నియమించడంపైనా వివాదం ఏర్పడింది. దాంతో పాటు యూనివర్సిటీ పరిధిలోని ఫార్మసీ కాలేజీలకు వీసీ రమేష్ అడ్డగోలుగా పర్మిషన్లు ఇచ్చారని, యూనివర్సిటీకి సంబంధించిన పనుల విషయంలో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల విషయంలోనూ అధికారులకు కక్కుర్తి పడినట్లు ఆరోపణలున్నాయి.ముఖ్యంగా పీహెచ్‌డి సీట్లను అనర్హులకు కట్టబెట్టి అక్రమంగా సంపాదించారనే ఆరోపణలతో పాటు వర్సిటీ భూములు ఆక్రమించిన వారికి సపోర్ట్ చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతోనే వీసీ రమేష్ పదవీకాలం ముగిసే సమయంలోనే ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది.కాకతీయ యూనివర్సిటీ ప్రస్తుత రిజిస్ట్రార్ ప్రొ.మల్లారెడ్డి అసోసియేట్ ప్రొఫెసర్ గా నియామకంపై విచారణ జరపాల్సిందిగా ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి నుంచి కేయూ ఇన్చార్జ్ వీసీకి ఉత్తర్వులు జారీ అయ్యాయి.అసిస్టెంట్ ప్రొఫెసర్ గా సరైన అనుభవం లేకున్నా.. అప్పటి అధికారులు నిబంధనలకు విరుద్ధంగా మల్లారెడ్డికి అసోసియేట్ ప్రొఫెసర్ గా నియమించారంటూ హనుమకొండకు చెందిన కేవన్ రెడ్డి అనే వ్యక్తి దాదాపు 15 రోజుల కిందట చీఫ్ సెక్రటరీతో పాటు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు.దీంతో ఈ ఫిర్యాదుపై విచారణ జరిపి వెంటనే నివేదిక పంపాల్సిందిగా ప్రస్తుత ఇన్చార్జ్ వీసీకి ఉత్తర్వులు (నెం.1457/జఇ/o2/2024) జారీ చేశారు. ఇలా వర్సిటీ ఉన్నతాధికారులపై వరుసగా విచారణలు జరుగుతుండటంతో కేయూలో గందరగోళ వాతావరణం కనిపిస్తోంది.

# ప్రపంచ బ్యాంకు ముందు సాగిలా...సరిపోయారు..ఇద్దరు




**హైదరాబాద్ :** ప్రపంచ బ్యాంకు నుంచి రుణం తీసుకుంటే ఎంత డేంజరో ఆర్థిక నిపుణులను ఎవరిని అడిగినా చెబుతారు. తాము ఇచ్చిన నిధులకు లెక్కా పత్రాలతో చెప్పడమే కాకుండా సంక్షేమ పథకాలకు కూడా కోత పెడుతుంది. ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు తీసుకుంటే ఒక రకంగా మన పిలక వారి చేతుల్లో ఉన్నట్లేనని వేరే చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడు రెండు తెలుగడు రాష్ట్రాలు ప్రపంచబ్యాంకు విషకౌగిలిలోకి చేరేందుకు సిద్ధమవుతున్నాయి. అమరావతి రాజధాని నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో చర్చించారు. అంటే రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నిధులిస్తే ఇక వారి పెత్తనమే కొనసాగుతుందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు తెలంగాణ ముఖ్యమంత్రి... మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో సమావేశమయ్యారు. కొద్ది రోజుల క్రితం ఆయన జరిపిన అమెరికా పర్యటనలో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో చర్చలు జరిపారు. వివిధ ప్రాజెక్టులకు రేవంత్ రెడ్డి నిధుల కోసం చర్చలు జరిపారు. ప్రజారోగ్య రంగానికి, హైదరాబాద్ 4.0, మూసీ ప్రక్షాళన, స్కిల్ యూనివర్సిటీ వంటి వారికి నిధులు ఇవ్వాలని కోరారు. నిధులు ఇచ్చేందుక ప్రపంచ బ్యాంకు ఎలాంటి అభ్యంతరాలుండవు. వడ్డీతో సహా నిధులను ముక్కుపిండి వసూలు చేస్తుంది. పైగా తాము చెప్పిన రంగాలకే నిధులను కేటాయించాలంటూ షరతులను విధించడంలో ప్రపంచ బ్యాంకు ఎప్పుడూ వెనకాడదు నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో... గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు తెచ్చుకున్నారు. అనేక సంస్కరణలను చేపట్టేందుకు వీటిని తీసుకున్నట్లు చెప్పారు. కానీ తర్వాత చంద్రబాబు ప్రజలపై పన్నుల భారం మోపాల్సి వచ్చింది. విద్యుత్తు నుంచి అన్ని రకాల పెన్నులు పెంచిన చంద్రబాబు నాడు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయింది. ముఖ్యంగా కమ్యునిస్టు పార్టీల ప్రపంచ బ్యాంకు నుంచి రుణం పొందడానికి అస్సలు అంగీకరించవు. పెద్దయెత్తున ఉద్యమం చేసేవి. ప్రపంచ బ్యాంకును రాష్ట్రానికి తాకట్టు పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారంటూ కామ్రేడ్లు కన్నెర్ర చేశారు. ఫలితంగా చంద్రబాబు రెండు దఫాలు అధికారానికి దూరం అవ్వాల్సి వచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి కానీ, అనంతరం రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన కేసీఆర్ ప్రభుత్వం కానీ ప్రపంచ బ్యాంకు నిధుల జోలికి వెళ్లలేదు. ఎఫ్ఆర్ఎంబీ నిబంధనల మేరకు దేశీయ రుణాలను మాత్రమే తీసుకునే వారు. దీంతో సంక్షేమ పథకాల్లో కోత ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచ బ్యాంకు జపం చేయడాన్ని ఆర్థిక నిపుణులు తప్పుపడుతున్నారు. ఇక రెండు రాష్ట్రాల్లో కమ్యునిస్టులు కూడా వీటిపై పెదవి విప్పడం లేదు. తెలంగాణలో కమ్యునిస్టులు కాంగ్రెస్ తో జతకట్టగా, ఏపీలో మాత్రం చంద్రబాబు ప్రభుత్వాన్ని కామ్రేడ్లు ప్రశ్నించే సాహసం చేయలేకపోతున్నారన్న మాట మాత్రం వాస్తవం

# సీనియర్ లీడర్స్ మిస్సింగ్

**హైదరాబాద్ :** అధికారంలో ఉన్నన్ని రోజులు పదవులు అనుభవించారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడి కార్యకర్తలకు ఏ ఇబ్బంది వచ్చినా ముందుండి ఎదుర్కోవాల్సిన ఈ సీనియర్ నేతలే ఇలా అయితే ఎలా అంటూ భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. 2014, 2018 రెండు దఫాలుగా మంత్రి పదవి అనుభవించి, అది కూడా నెంబర్ టూ పొజిషన్ అనుభవించిన ఓ మాజీ మంత్రి ఎప్పుడు పెద్దగా ఎక్కడ యాక్టివ్‌గా కనిపించడం లేదట.ప్రభుత్వంలో ఉన్నప్పుడు అంత చురుగ్గా ఉన్న మంత్రి, ఇప్పుడు కూడా అలాగే ఉంటారనుకున్నారు. అయితే ప్రస్తుతం సైలెంట్‌గా ఉండటం పార్టీలో ఇబ్బందిగా మారిందట. ఇదే గ్రేటర్ హైదరాబాద్ కు చెందిన మరో మాజీ మంత్రి పార్టీ కార్యక్రమాలకు అంటి ముట్టనట్లుగా ఉంటున్నారట. అధికార పార్టీకి సంబంధించి దేనిపైనైనా మీడియా రియాక్షన్ అడిగిన ఇప్పుడేమీ మాట్లాడను అంటూ దాటవేస్తున్నారట. గ్రేటర్ లో మాస్ లీడర్‌గా ఉన్న ఈ నేత ఇప్పుడు ఎందుకు క్లాస్‌గా వ్యవహరిస్తున్నారన్నదీ కార్యకర్తలకు అర్థం కావడం లేదట.ఇక ఉత్తర తెలంగాణకు చెందిన మరో మాజీ అసలు రాజకీయాల్లో ఉన్నారా అనే అనుమానం వచ్చేలా వ్యవహరిస్తున్నారట. ఇక ఖమ్మం జిల్లాకు సంబంధించిన మరో మాజీ మంత్రి ఎన్నికల తర్వాత కనిపించడమే మానేశారట. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో మాజీ మంత్రి, ఇప్పుడు తన కుటుంబానికి మరో టికెట్ దక్కించుకుని ఇద్దరు ఎమ్మెల్యేగా గెలిచారు. అంతకుముందు తొడలు కొట్టి రేవంత్ రెడ్డికి సవాలు విసిరిన ఈ మాజీ మంత్రి, ఇప్పుడు మాత్రం నియోజకవర్గంలో దాటి బయటకు రావడం లేదట.ఇక ఎమ్మెల్యేలుగా గెలిచిన ఇద్దరు మాజీ మంత్రులు కేవలం నియోజకవర్గాలకే పరిమితమై, పార్టీతో తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారట. మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస గౌడ్, ప్రశాంత్ రెడ్డి, జగదీష్ రెడ్డి, సబిత, సత్యవతి రాథోడ్,



కొప్పుల ఈశ్వర్ వీరు మాత్రమే తెలంగాణ భవన్‌కు వస్తూ పోతూ.. పార్టీలో యాక్టివ్‌గా కనిపిస్తున్నారు. అంతేకాదు ప్రభుత్వ విధానాలపై ఎప్పటికప్పుడు ప్రెస్ మీట్ పెట్టి తమ వైఖరిని తెలియజేస్తున్నారు.ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ, అనేక సమస్యలపై జిల్లాల వారీగా అక్కడికక్కడే ప్రభుత్వం నిలదీయండి అంటూ గతంలోనే కేసీఆర్ సీనియర్ లీడర్లు అందరికీ చెప్పారు. అన్నింటికీ తెలంగాణ భవన్ వేదిక కాదు, జిల్లా స్థాయి సమస్యలను జిల్లాకు పార్టీ కార్యాలయాల్లో ప్రెస్‌మీట్ రూపంలో, ఆందోళన కార్యక్రమాల రూపంలో నిరసన తెలుపాలంటూ సూచించారు. కానీ ఈ మాజీ మంత్రులేమో కనీసం కార్యకర్తలకే అందుబాటులో ఉండడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.వీరితోపాటు గత ప్రభుత్వంలో ముఖ్య నేతలుగా ఉన్న వాళ్ళు సైతం సైలెంట్ అయిపోయారు. మీడియా ముందు మౌత్ పీసులుగా తరచూ కనిపించిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎమ్మెల్సీలు కొంతమంది మనకెందుకులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారట. అధికారంలో ఉంటే పదవులు అనుభవిస్తారు.. అధికారం పోతే అంటి మొట్టనట్టుగా ఉంటారా అన్నట్లుగా కార్యకర్తలు కామెంట్ చేస్తున్నారు.

# క్రమబద్ధీకరణకు గ్రీన్ సిగ్నల్




**హైదరాబాద్ :** పొలిటికల్‌గా రచ్చరేపిన ఎల్ఆర్ఎస్ విషయంలో ఎట్టకేలకు ముందడగు పడింది. 2020లో క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లకు మరో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పేక మేడలు కాదు. ఇల్లీగల్ కన్‌స్ట్రక్షన్స్. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాల కూల్చివేతల పర్వం మొదలైంది. హైడ్రా ఆపరేషన్ అక్రమార్కుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది.మరోవైపు లే -అవుట్ రెగ్యూలరైజేషన్ స్కీమ్.. ఎల్ఆర్ఎస్ పై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. లే అవుట్స్, ప్లాట్స్ క్రమబద్ధీకరణకు మరో ఛాన్స్ ఇచ్చింది. కాకపోతే కండీషన్స్ అప్లయ్. 2020 అక్టోబర్ 15లోపు దరఖాస్తు చేసుకున్న వాళ్లకే క్రమబద్ధీకరణ అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు సంబంధిత అధికారులు. 131, 135 జీవో నెంబర్ల ప్రకారం రాష్ట్రాల అక్రమ లే-అవుట్స్, ప్లాట్స్ రెగ్యూలరైజషన్ కోసం 2020లో నియమ నిబంధనలు జారీ అయ్యాయి.2020 ఆగస్టు26 కన్నా ముందు రిజిష్టర్ చేసిన లే అవుట్లకు మాత్రమే ఎల్ఆర్ఎస్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. గైడ్‌లైన్స్ 2020లోనే విడుదలైనా దరఖాస్తుల పరిశీలన గత జనవరి నుంచే మొదలైంది. ఇప్పటి వరకు 4లక్షల 28వేల 832 అప్లికేషన్లను స్క్రూట్నీ చేశారు. 60 వేల 2వందలకు పైచిలుకు దరఖాస్తులకు ఆమోద ముద్ర పడింది. తద్వారా ఫీజుల రూపేణ సర్కార్ ఖజానాలో 96 కోట్ల 60 లక్షలు జమయ్యాయిమరి మిగతా అప్లికేషన్ల మాటేంటి? దాదాపు 75 శాతం దరఖాస్తులకు ఆమోద ముద్రం పడకపోవడానికి కారణం..సరైన డాక్యుమెంట్లు సమర్పించకపోవడం..సమగ్ర వివరాలు పొందుపర్చకపోవడం.అలాంటి వారికి ఇప్పుడు మరో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సేల్ డీడ్, ఈసీ, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్ , లే-అవుట్ కాపీలను జతపరిస్తే మళ్లీ ఆ దరఖాస్తులను పరిశీలిస్తారు. మొబైల్ ద్వారా కూడా డాక్యుమెంట్స్‌ను అప్‌లోడ్ చేయవచ్చు. లేదంటే మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ ఆఫీసుల్లో స్వయంగా ఇవ్వొచ్చు. సలహాలు సూచనల కోసం హెల్ప్ డెస్క్‌లను కూడా ఏర్పాటు చేశారు అధికారులు.కాంగ్రెస్ సర్కార్ అధికార పగ్గాలు చేపట్టిన కొత్తలోనే ఎల్ఆర్ఎస్ పై రాజకీయ రచ్చ రాజుకుంది. అధికారంలోకి రాగానే ల్యాండ్ రెగ్యూలరైజేషన్‌ను ఫ్రీగా చేస్తామన్న హామీని నిలపెట్టుకోవాలని బీఆర్ఎస్ ఆందోళనలు చేపట్టింది. మరోవైపు, మాటేంటే మాటేనన్న కాంగ్రెస్ సర్కార్ ఎల్ ఆర్ ఎస్ అమలు కోసం విధి విధానాలపై ఫోకస్ పెట్టింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ కోసం దాఖలైన దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా స్పెషల్ టీమ్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని.. సిబ్బంది కొరత వుంటే ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మొత్తానికి దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. 60 వేల 2వందల అప్లికేషన్లకు ఆమోదం లభించింది. మిగతా వారికి మరో అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఐతే 2020 అక్టోబర్ 15లోపు దరఖాస్తు చేసుకున్న వాళ్లకే క్రమబద్ధీకరణ అవకాశం కల్పించారు.

# దుర్గయ్య హ్యాట్సాఫ్

**కరీంనగర్ :** సమాజంలో ఎంతోమంది సమాజ సేవకులను చూసే ఉంటాం. రకరకాల సేవా సంస్థల పేరుతో సమాజంలో నిరుపేదలకు సహాయం చేసేందుకు నిత్యం ఏదో ఒక రకమైన కార్యక్రమం పేరుతో కొంతమంది సమాజ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సమాజ సేవ అంటే జన్మదిన సందర్భంగా రక్తదానం చేయడం అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం లేక సైకిళ్లను పంచి పెట్టడం లేదా దుస్తులను పంచిపెట్టడం చేస్తుంటారు. ఇలాంటివన్నీ కూడా సామాన్యంగా ఏవైనా స్వచ్ఛంద సేవా సంస్థలు లేక మధ్యతరగతి పై కుటుంబాలు ధనిక కుటుంబాలు చేస్తుంటారు. అయితే ఇతను మాత్రం వీరందరిలా కాదు రోడ్లపై ఎక్కడైనా గుంతలు కనిపించాయంటే చాలు వెంటనే ఓ ఆటోలో మట్టిని నింపి తీసుకొచ్చి ఆ గుంతను పూడ్చేస్తారు. ఇలా గత 15 సంవత్సరాలుగా చేస్తున్నాడు. నిరుపేద కుటుంబంలో జన్మించి ఆటో డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తున్న ఆ వ్యక్తి ఎవరో తెలుసుకోవాలంటే మాత్రం ఈ స్టోరీ చదవాల్సిందే.కరీంనగర్ జిల్లా చొప్పదండి గ్రామానికి చెందిన అడ్లూరి దుర్గయ్య ఆటో డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తున్నారు. ఆయనకు సమాజసేవపై మక్కువ ఎక్కువ అందువల్లే రోడ్లపై ఎక్కడైనా చిన్న గుంత కనిపించింది అంటే చాలు వెంటనే తన ఆటోను తీసుకుపోయి ఓ గడ్డపార, ఓ పార సాయంతో తానే మట్టిని ఆటోలో నింపుకొని ఆ గుంతలను పూడ్చేస్తాడు. అయితే చొప్పదండి ధర్మారం ప్రాంతంలో క్వారీలు అధికంగా ఉండడం లారీలు తిరగడంతో రోడ్లు పూర్తిగా పాడవుతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. నిత్యం వందల సంఖ్యల్లో ప్రయాణించే ఈ రోడ్డుపై నిరుపేదలు కూడా ప్రయాణిస్తుంటారు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు యోచిస్తుంటారు. అయితే తన కళ్ళ ముందు ఎన్నో ప్రమాదాలు చూసి తట్టుకోలేక పోయారు దుర్గయ్య.



ప్రమాదాల్లో మరణించిన వారి పార్థివ దేహాలను కూడా కొంతమంది నిరుపేదలవి ఆయనే పూడ్చి పెట్టారట. వడ్లూరి దుర్గయ్య చొప్పదండి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా ఆటో ట్రాలీ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని ఆయనకు సంతానం ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ ఆటో నడుపుతూనే వారిని ప్రయోజకుల చేశారని గ్రామస్తులు తెలిపారు. అయితే చొప్పదండి చుట్టుపక్కల గ్రామాలలో ఎక్కడ గుంతలు కనిపించిన వాటిని తన సొంత ఖర్చుతో ఆ గుంతలను పూడుస్తారని ఎలాంటి లాభాన్ని ఆశించకుండా ఇలా గత 15 సంవత్సరాలుగా చేస్తున్నారని అంటున్నారు గ్రామానికి చెందిన ప్రసాద్. ఎలాంటి లాభాన్ని ఆశించకుండా సమాజం కోసం తన వంతు సహాయంగా కృషి చేస్తున్న ఇలాంటి వ్యక్తులను ప్రోత్సహించాలన్నారు. అయితే ఈ రోడ్లను పూడ్చుడం ప్రభుత్వం పని అయినా తాను రోడ్లపై జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని తన వంతు కృషి చేస్తున్నారని అంటున్నారు గ్రామస్తులు.గత 15 సంవత్సరాలుగా దుర్గయ్య చేస్తున్న సమాజ సేవను గుర్తించిన కొంతమంది సమాజ సేవకులు ఆయనను సన్మానిస్తున్నారు. అయితే ప్రస్తుతం దుర్గయ్య ఆటో పాడైపోయే స్థితిలో ఉంది, కావున ఎవరైనా దుర్గయ్యను ఆదుకోవాలని.. ఆయనను ఎవరైనా ఆదుకుంటే సమాజం కోసం కృషి చేస్తారని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.

# గులాబీలో ఆపరేషన్ బాలి



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ మధ్య టామ్ అండ్ జెర్రీ పోరాటం హోరాహోరీగా కొనసాగుతోంది. విదేశీ పర్యటన నుంచి తిరిగొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఆపరేషన్ ఆకర్ష్ 2.ా ప్రారంభించేందుకు కసరత్తు చేస్తుండగా, సీఎం వలకు ఎవరూ చిక్కకుండా? ఎమ్మెల్యేలను కాపాడుకోడానికి బీఆర్ఎస్ ఎత్తుగడలు వేస్తోంది. ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కుమారుడి వివాహానికి దాదాపు ఎమ్మెల్యేలందరికీ ఆహ్వానం అందింది. ఈ వివాహం కోసం బాలి వెళ్లిన బీఆర్ఎస్ శాసనసభ్యులతో ట్రబుల్ షూటర్ హరీశ్ రావు కూడా జాయిన్ అయ్యారుబీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా లేకుండా చేయాలనే ఏకైక టార్గెట్‌తో ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టిన కాంగ్రెస్? ఇప్పటివరకు 10 మంది ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ కండువాలు కప్పింది. ఇంకా 16 మంది ఎమ్మెల్యేలను హస్తం గూటికి రప్పించేందుకు సామ దాన బేధ దండోపాలయాలను ప్రయోగిస్తోంది. ఐతే కొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌పై విముఖత వ్యక్తం చేయడంతో కొద్దిరోజులుగా బ్రేక్ పడింది. ఇక సీఎం విదేశీ పర్యటన నుంచి తిరిగి రావడంతో రెండో విడత ఆకర్ష్‌కు తెర తీయనున్నట్లు ప్రచారం జరుగుతోందిఎమ్మెల్యేలు జారిపోకుండా చూసుకునే బాధ్యతను ట్రబుల్ షూటర్ హరీశ్ రావుకు అప్పగించిందని చెబుతున్నారు. అందుకే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కుమారుడి వివాహానికి ఎమ్మెల్యేలతోపాటుగా బాలి వెళ్లిన హరీశ్ రావు? పార్టీ నుండి ఎవరూ చేజారకుండా అక్కడే వ్యూహరచన మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఇకపై ఒక్క ఎమ్మెల్యే కూడా కారు దిగకుండా పకడ్బందీగా స్కెచ్ వేసినట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రలోభాలకు ఎవరూ తలొగ్గొద్దని? భవిష్యత్ మళ్లీ బీఆర్ఎస్‌దేనని ఎమ్మెల్యేలకు భరోసా ఇస్తున్న హరీశ్ రావు? పార్టీని వీడనున్నారని అనుమానం ఉన్న వారితో బాలిలోనే ప్రత్యేకంగా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. హరీశ్ రావు భరోసాతో అటూ ఇటుగా ఉన్న ఎమ్మెల్యేలు సైతం కారులోనే కొనసాగతామని చెప్పినట్లు తెలుస్తోందిఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కుమారుడి వివాహం కోసం హరీశ్‌రావుతో పాటు మెజారిటీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెళ్లినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా చర్చించిన హరీశ్ రావు కాంగ్రెస్ ఎన్నికల హామీలు అమలు చేయలేదని?. ఇప్పటికే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతతో కనిపిస్తున్నందున పార్టీ మారి తప్పు చేయొద్దని ఎమ్మెల్యేలకు నచ్చజెబుతున్నట్లు సమాచారం.ఇక మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కోసం కండువాలు తెప్పించిన కాంగ్రెస్ నేతలు.. ఎమ్మెల్యేలు బాలి నుంచి ఎప్పుడు తిరిగి వస్తారా? అని ఎదురుచూస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు 28 మంది ఎమ్మెల్యేలు ఉండగా, వీరిలో 16 మందిని ఎలాగైనా లాగేసి విలీనం చేసుకునేందుకు కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. ఐతే కాంగ్రెస్ కలలు ఫలించే పరిస్థితి లేదని బీఆర్ఎస్ చెబుతోంది. పార్టీ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులతోపాటు మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వంటి వారిని టచ్ చేయలేరని? ఇలా పార్టీకి విధేయంగా సుమారు 15 మంది ఉన్నట్లు చెబుతున్నారు. మిగిలిన ఆరేడుగురు ఊగిసలాటలో ఉన్నా? ఆపరరేషన్ బాలి తర్వాత వారు కూడా కారు దిగేందుకు సుముఖంగా లేరని తెలుస్తోంది.